క్లుప్తంగా

నేడు ఆసరా చెక్కుల పంపిణీ

పెడన: నందమూరు సెక్టారు పరిధిలోని బలిపర్రు, మడక, జింజేరు, అచ్చయ్యవారిపాలెం, నందమూరు గ్రామాలకు చెందిన డ్వాక్రా అక్కచెల్లెమ్మలకు నందమూరు గ్రామంలో బుధవారం ఉదయం పది గంటలకు ఆసరా మూడో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమం జరుగుతుంది. బుధవారం సాయంత్రం నాలుగు గంటలకు పెడన పట్టణంలోని 23 వార్డులలోని వారికి పెడన వ్యవసాయ మార్కెట్ యార్డులో చెక్కుల పంపిణీ జరుగుతుంది. ఆయా కార్యక్రమాల్లో మంత్రి జోగి రమేష్ పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

అవనిగడ్డ: కృష్ణా జిల్లాలోని ఏపీ గురుకుల విద్యాలయాల్లో 5 నుంచి 8వ తరగతి వరకు ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని పులిగడ్డ గురుకుల విద్యాలయం ప్రిన్సిపాల్ ఎస్‌టీపీ కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులంలో చేరాలనుకునే వారు ఈనెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్: 98665 59628 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

టెన్త్ దివ్యాంగ విద్యార్థినికి వీల్‌చైర్ అందజేత

పెడన: పట్టణంలోని భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ హెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థిని కందుల సునీతకు వికలాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పెడన ఐఆర్‌టీ వారు వీల్‌చైర్‌ను అందజేశారు. విద్యార్థిని సునీత పల్లోటి సెయింట్ విన్సెంట్ హైస్కూల్ పరీక్షా కేంద్రంలో పరీక్షలు రాస్తోంది. బుధవారం బంగ్లా స్కూల్‌లో సునీత తల్లిదండ్రులకు వీల్‌చైర్‌ను అందజేశారు. కార్యక్రమంలో ఐఆర్‌టీ టీచరు శశికళ, ఎస్‌ఎస్‌ఏ కో-ఆర్డినేటర్ వై. ఏడుకొండలు, పెడన ఎంఈఓ మెటల్దారాణి, బంగ్లా స్కూల్ హెచ్‌ఎం భాగ్యలక్ష్మీ పాల్గొన్నారు.

ఢిల్లీ సదస్సుకు మేయర్, డెప్యూటీ మేయర్, కమిషనర్

మచిలీపట్నంటౌన్: దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించనున్న ఆసియా సిటీ సమ్మిట్ సదస్సుకు నగర మేయర్ మోకా వెంకటేశ్వరమ్మ, డెప్యూటీ మేయర్ బందెల కవిత థామస్ నోబుల్, కమిషనర్ జి. చంద్రయ్య మంగళవారం బయలుదేరి వెళ్లారు. బుధవారం నుంచి శుక్రవారం వరకు ఢిల్లీ ఏరో సిటీ ప్రాంతంలోని హోటల్‌లో జరిగే సదస్సులో వీరు పాల్గొంటారు. రాష్ట్ర ప్రభుత్వ మునిసిపల్ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వై. శ్రీలక్ష్మీ సదస్సుకు హాజరవుతారు.

కనుల పండువగా స్వామివారి తిరు కల్యాణం

మచిలీపట్నంటౌన్: బచ్చుపేటలోని వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి తిరు కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారి కల్యాణం మంగళవారం రాత్రి కనుల పండువగా నిర్వహించారు. ఆలయ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ ముత్తేవి రవికాంత్, భార్గవి దంపతులు పీటలపై కూర్చున్నారు. తొలుత ప్రత్యేక పూజలు, హోమాలు, కల్యాణ మూర్తులకు స్వర్ణోత్సవ విశేష స్నపన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ ఎస్‌ఎస్ చక్రధరరావు పర్యవేక్షించారు.

టెన్నికాయిట్ పోటీలు ప్రారంభం

అవనిగడ్డ: దివంగత మంత్రి మండలి వెంకట కృష్ణారావు సతీమణి ప్రభావతిదేవి జ్ఞాపకార్థం స్థానిక గాంధీక్షేత్రంలో ఏర్పాటు చేసిన టెన్నికాయిట్ పోటీలు బుధవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ప్రభావతిదేవి చిత్రపటానికి మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ సతీమణి విజయలక్ష్మీ పూలమాల వేసి నివాళులర్పించారు. లీగ్ పద్ధతిలో జరిగే ఈ పోటీల్లో మొత్తం 28 జట్లు పాల్గొననున్నాయి. మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ఈ పోటీలను పర్యవేక్షించారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ



కోనేరుసెంటర్: చిలకలపూడిలో ఇరు వర్గాలకు చెందిన యువకుల మధ్య మంగళవారం ఘర్షణ జరిగింది. ఒక వర్గంపై మరొక వర్గం వారు కర్రలతో దాడికి పాల్పడ్డారు. అనంతరం ఒక వర్గం యువకులు అక్కడి నుంచి వెళ్లిపోగా ఆగ్రహంతో ఉన్న మరో వర్గం యువకులు బైక్‌లపై కర్రలతో చిలకలపూడిలో చక్కర్లు కొట్టారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. ఈ క్రమంలో కొందరు యువకులు పోలీసుల పట్ల దురుసుగా ప్రవర్తించారు. బందరు డీఎస్పీ మాసూంబాషా ఆదేశాల మేరకు రూరల్ ఎస్‌ఐ చాణక్య, మచిలీపట్నం ఇన్‌చార్జి ఎస్‌ఐ సత్యనారాయణ, సిబ్బందితో కలిసి యువకులను చెల్లాచెదురు చేశారు. యువకుల మధ్య ఘర్షణకు కారణాలు తెలియాల్సి ఉంది.

చెరువులను నీటితో నింపాలి

గుడివాడటౌన్ (నందివాడ): నందివాడ మండలంలోని దోసపాడు చానల్ పరివాహక ప్రాంతంలోని అన్ని గ్రామాల్లోని మంచినీటి చెరువులను తక్షణమే పూర్తిగా నీటితో నింపాలని నీటి సరఫరా శాఖ డెప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సూర్యభరత్ తెలిపారు. మంగళవారం ఆయన ఏఈ పవన్‌కుమార్‌తో కలిసి గ్రామాల్లో చెరువులు నింపే ప్రక్రియను పరిశీలించారు.

మహిళాభ్యున్నతికి పెద్ద పీట

- మంత్రి జోగి రమేష్
- డ్వాక్రా మహిళలకు మూడో విడత ఆసరా చెక్కుల పంపిణీ



చెన్నూరులో చెక్కులు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



మోపిదేవిలో చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సింహాద్రి



బంటుమిల్లి మండలం అర్తమూరులో చెక్కులు అందజేస్తున్న మంత్రి జోగి రమేష్



అరిశేపల్లిలో చెక్కు అందజేస్తున్న పేర్ని కిట్టు

పెడన: మహిళాభ్యున్నతికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి జోగి రమేష్ అన్నారు. చెన్నూరు క్లస్టర్‌లోని చెన్నూరు, చేవేంద్ర, ఉరివి, కమలాపురం, కొంగంచర్ల, కొప్పల్లి, లంకలకలువగుంట, గురువిందగుంట గ్రామాల్లోని 244 గ్రూపుల్లోని 2,435 మందికి రూ.2.43 కోట్ల ఆసరా మూడో విడత చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ అమ్మఒడి, జగనన్న విద్యా దీవెన, ఆసరా, చేయూత, వైఎస్సార్ శాశ్వత భూ హక్కు పత్రం, ఇంటి పట్టా తదితర పథకాలను మహిళల పేరుతోను ఇస్తున్నారని, వారి బ్యాంకు ఖాతాలకు నేరుగా నగదు జమ చేస్తున్నారని చెప్పారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు రుణమాఫీ చేసి డబ్బులు వేస్తున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని అన్నారు. డబ్బు శాశ్వతం కాదని, విద్యా, విజ్ఞానం శాశ్వతమని, వాటిని అందించేందుకు తల్లులు తమ పిల్లలను బాగా చదివించాలని చెప్పారు. మన పిల్లల కోసం, వారి భవిష్యత్ బాగుండాలనే ధృఢ సంకల్పంతో ప్రభుత్వ బడులలో ఇంగ్లిష్ మీడియం చెప్పిస్తున్నారని అన్నారు. మన కోసం, మన మంచి చెడ్డలు చూడటానికి, ఆర్థికంగా బలోపేతం కావడానికి, మన పిల్లలు బాగా చదువుకోవాలని సంకల్పిస్తున్న జగనన్నకు మనమందరం అండగా నిలుద్దామని, ఆయన వెన్నంటే నడుద్దామని చెప్పారు. మంత్రి తనయుడు జోగి రాజీవ్, ఎంపీపీ రాజులపాటి వాణి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ గరికిపాటి చారుమతి, అచ్యుతరావు, గుడిసేవ లక్ష్మీరాణి, తేజోధరణి, కొండవీటి నాగబాబు, రామానాయుడు, శంకర్, భైరవలింగం, వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ సుబ్బారావు, ఏసీ కనకారావు, ఏపీఎం శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు

మోపిదేవి: నాడు చంద్రబాబు మోసపూరిత హామీలతో డ్వాక్రా మహిళలను నట్టేట ముంచితే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి డ్వాక్రా మహిళల ఆర్థిక ప్రగతికి బాటలు వేస్తున్నారని అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు అన్నారు. మండలంలోని 7,510 మంది డ్వాక్రా మహిళలకు రూ. 7,45,47,001 విలువగల ఆసరా మూడో విడత చెక్కును మోపిదేవిలో మంగళవారం అందజేశారు. ఎమ్మెల్యే సింహాద్రి మాట్లాడుతూ ఆర్థిక సంపన్నులకు దోచిపెట్టేది టీడీపీ అయితే పేదల బతుకులు మార్చుతుంది వైఎస్సార్ సీపీ అని అన్నారు. చంద్రబాబు పాలనలోనే కాపులకు తీరని అన్యాయం జరిగిందని చెప్పారు. ఉన్నత చదువులకు పార్టీ అడ్డుకాకూడదని, ఇటీవల టీడీపీకి చెందిన విద్యార్థినికి విదేశీ చదువు నిమిత్తం రూ. 83 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిదేనని గుర్తుచేశారు. ఇంటింటా వైద్య సేవలు అందిస్తున్న జగనన్నను మరోసారి దీవించాలని డ్వాక్రా అక్కాచెల్లెమ్మలను కోరారు. దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, డీఆర్‌డీఏ నియోజకవర్గ ఏసీ రవి, సర్పంచ్‌లు నందిగం మేరీరాణి, గరికిపాటి వెంకటేశ్వరరావు(బుల్లి), మోర్ల జ్యోత్స్న, తుమ్మా సోములమ్మ, పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు రావి రాంప్రసాద్, ఆది రాంబాబు, రెడ్రౌతు వెంకటరమణ, తుటారం కృష్ణ, పండలనేని అన్నపూర్ణ, మార్కెటింగ్ డైరెక్టర్ పరమేశ్వరి, మోర్ల శ్రీనివాసరావు, రాజులపాటి నాగేశ్వరరావు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయం మోపిదేవి యూనిట్ కింద ప్రదర్శించిన నవధాన్యాల కిట్లను ఎమ్మెల్యే చేతుల మీదుగా రైతులకు పంపిణీ చేశారు.

మహిళలను మహారాణులుగా చేసిన జగన్

బంటుమిల్లి: బంటుమిల్లి మండలం అర్తమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం వైఎస్సార్ ఆసరా మూడో విడత చెక్కులను మంత్రి జోగి రమేష్ స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి అందజేశారు. మంత్రి మాట్లాడుతూ బర్రిపాడు, కంచడం, ముంజులూరు, అర్తమూరు, మణిమేశ్వరం, సాతులూరు గ్రామాలకు చెందిన 242 గ్రూపులకు చెందిన రూ. 2,24,55,036 విలువగల చెక్కును అందజేశామని చెప్పారు. ప్రభుత్వ పథకాల అమలులో మహిళలను మహారాణులుగా చేసిన ఘనత సీఎం జగనన్నకే దక్కిందని చెప్పారు. తొలుత బుక్ కీపర్లు మంత్రికి మెమెంటో అందజేశారు. ఐసీడీఎస్, వైద్య శాఖలు ఏర్పాటు చేసిన పౌష్టికాహారం, వైద్య శిబిరం స్టాల్‌ను సందర్శించి నిర్వాహకులను అభినందించారు. ఎంపీపీ వి. చినబాబు, జెడ్పీటీసీ ఎం. వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్లు కె. గంగాధర్, పి. బాబూరావు, వైస్ ఎంపీపీ ఓ. చిన్నారిబాబు, మంత్రి తనయుడు జోగి రాజీవ్, క్లస్టర్ గ్రామాల సర్పంచ్‌లు బి. రమేష్, బి. చంద్రశేఖర్, బాలస్వామి, కె. సునీత, కె. వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ జె. స్వర్ణ భారతి, తహసీల్దార్ సత్యనారాయణమూర్తి, ఎంఈఓ కేఎస్‌పీ ప్రసాదు, నాయకులు పాల్గొన్నారు.

జగనన్నకు అండగా ఉందాం

కోనేరుసెంటర్: రాష్ట్రంలో జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అక్కాచెల్లెమ్మలు అందరూ అండగా ఉండాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు) అన్నారు. మండల పరిధిలోని అరిశేపల్లి, ఎస్ఎన్ గొల్లపాలెం, సీతారామపురం, సుల్తానగరం గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ ఆసరా పథకం వారోత్సవాల్లో కిట్టు పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని లబ్ధిదారులకు ఆసరా చెక్కులను అందజేసి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎన్ గొల్లపాలెం మాజీ సర్పంచ్ మట్టా నాంచారయ్య, అరిశేపల్లి ఇన్‌చార్జి చండిక అజయ్, సుల్తానగరం ఇన్‌చార్జి వెంకటేశ్వరరావు, సీతారామపురం బ్యాంక్ అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం, బందరు నియోజకవర్గ కన్వీనర్ వాలిశెట్టి రవిశంకర్, డ్వాక్రా మహిళలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వడ్డీ మాఫీతో తగ్గిన పన్నుల భారం

- నగరంలో రూ. 3.5 కోట్ల పన్ను వసూలు
- రూ. 6.10 కోట్ల వడ్డీ మాఫీ
- వార్షిక పన్ను వసూలు రూ. 16.46 కోట్లు



మునిసిపల్ రెవెన్యూ విభాగంలో పన్నులు చెల్లిస్తున్న దృశ్యం

మచిలీపట్నంటౌన్: నగర పాలక సంస్థ పరిధిలో పన్ను చెల్లింపుదారులపై పడిన పన్ను భారం పెద్దఎత్తున తగ్గింది. పన్ను చెల్లింపుదారులపై పడిన భారాన్ని తగ్గించేందుకు పన్నుపై ఉన్న వడ్డీని ప్రభుత్వం మాఫీ చేసింది. నగర పాలక సంస్థకు చెల్లించాల్సిన పన్ను మొత్తాన్ని చెల్లిస్తే పన్నుపై పడిన వడ్డీ మొత్తం మాఫీ చేస్తూ మార్చి 16వ తేదీన ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ఈ జీఓ ప్రకారం మార్చి 17వ తేదీ నుంచి 31వ తేదీ వరకు పన్ను చెల్లించిన వారికి వడ్డీ మాఫీ చేశారు. వడ్డీ మాఫీ 15 రోజుల పాటు కొనసాగడంతో పన్ను చెల్లింపుదారుల నుంచి నగర పాలక సంస్థకు సుమారు రూ. 3.10 కోట్ల మేర బకాయిలు చెల్లించారు. ఈ బకాయిలు ఉన్న దాదాపు రూ. 6.10 కోట్ల మేర పన్ను భారం తగ్గింది. రాష్ట్ర ప్రభుత్వం పన్ను రాయితీ జీఓ జారీ చేయటం వల్ల అసలు పన్ను చెల్లించిన యజమానులకు వడ్డీ మాఫీ జరిగింది. పన్ను చెల్లింపుదారులు ఆనందం వ్యక్తం చేశారు.

రూ. 16.46 కోట్ల పన్ను వసూలు..

2022-23 వార్షిక పన్ను వసూళ్లు మార్చి 31వ తేదీ నాటికి రూ. 16.46 కోట్ల మేర జరిగింది. నగరంలో మొత్తం 51 వేల ఎసెస్‌మెంట్లు ఉండగా వీటికి రూ. 51.53 కోట్ల మేర పన్ను డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌లో రూ. 16.46 కోట్ల మేర వసూలు కాగా రూ. 35.07 కోట్ల బకాయిలు ఇంకా పన్ను చెల్లింపుదారులు చెల్లించాల్సి ఉంది. నగరంలో 47,962 మంది ప్రైవేటు ఎసెస్‌మెంట్ల నుంచి రూ. 22.04 కోట్ల డిమాండ్ ఉండగా దీనిలో రూ. 13.69 కోట్ల మేర వసూలైంది. రూ. 8.34 కోట్ల మేర ఇంకా బకాయి ఉంది.

అలానే రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలకు సంబంధించి 268 ఎసెస్‌మెంట్లు ఉండగా వీటిపై రూ. 19.41 కోట్ల డిమాండ్ ఉండగా దీనిలో రూ. 57.06 లక్షల మేర వసూలైంది. ఇంకా రూ. 18.84 కోట్ల మేర బకాయి ఉంది. కేంద్ర ప్రభుత్వ సంస్థలకు సంబంధించి 84 ఎసెస్‌మెంట్లు ఉండగా రూ. 2.34 కోట్ల బకాయి ఉండగా దీనిలో రూ. 19.93 లక్షలు మాత్రమే వసూలైంది. ఇంకా రూ. 2.14 కోట్ల మేర వసూలు కావాల్సి ఉంది. నగరంలో 2,689 ఖాళీ స్థలాలు ఉండగా వీటికి రూ. 7.73 కోట్ల బకాయి ఉండగా దీనిలో రూ. 1.99 కోట్ల మేర వసూలైంది. ఇంకా రూ. 5.74 కోట్ల బకాయిలు ఉన్నాయి.

చెల్లింపులు పెరిగాయి



రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16వ తేదీన పన్నులపై ఉన్న వడ్డీ మాఫీ జీఓ ఇవ్వటంతో పన్ను చెల్లింపులు పెరిగాయి. ఈ జీఓ వల్ల పన్ను చెల్లింపుదారులకు ఎంతో ఊరట కలిగింది. అసలు పన్ను కన్నా వడ్డీ అధికంగా ఉన్న వారికి ఈ జీఓ మేలు కలిగించింది. 2023-24 ఆర్థిక సంవత్సరానికి పన్నుల డిమాండ్ జారీకి సన్నాహాలు చేస్తున్నాం.

– కె అనూష, అసిస్టెంట్ కమిషనర్, నగర పాలక సంస్థ

పెడన పట్టణంలో 89 శాతం పింఛన్ల పంపిణీ



బందరు 11వ డివిజన్‌లో పింఛను అందజేస్తున్న వలంటీర్



పెడన బ్రహ్మపురంలో మంచంలో ఉన్న బాబూరావుకు పింఛను అందజేస్తున్న వలంటీర్

పెడన: పట్టణంలో వైఎస్సార్ ఆసరా పింఛన్లను రెండో రోజు మంగళవారానికి 89 శాతం మందికి పంపిణీ చేశారు. పట్టణంలోని తొమ్మిది సచివాలయాల పరిధిలో 4,518 మంది వివిధ రకాల పింఛన్లు పొందుతున్న లబ్ధిదారులున్నారు. వీరందరికి రూ.1,25,80,500 విడుదలయ్యాయి. సోమవారం మధ్యాహ్నం, మంగళవారం ఉదయానికి పూర్తిస్థాయిలో పింఛన్ల సొమ్ము విడుదల కావడంతో వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అందజేస్తున్నారు. 4 వేల మందికి రూ.1,11,43,000లను మంగళవారం సాయంత్రానికి అందజేశారు. బుధవారం మధ్యాహ్ననికి పూర్తిస్థాయిలో పింఛన్లు పంపిణీ చేస్తామని మున్సిపల్ అధికారులు తెలిపారు.

పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం జిల్లా ఫస్ట్

మచిలీపట్నంటౌన్: వైఎస్సార్ సామాజిక పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం నగర పాలక సంస్థ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. పింఛన్ల పంపిణీ నగరంలో రెండో రోజైన మంగళవారం కొనసాగింది. నగరంలోని పలు డివిజన్లలో వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు గడప గడపకు వెళ్లి పింఛనుదారులకు సొమ్మును అందజేశారు. నగరంలో మొత్తం 18,627 పింఛన్లు ఉండగా వీటిలో 16,083 పింఛన్లను పంపిణీ చేసి 86.34 శాతం పూర్తి చేశారు. పింఛన్ల పంపిణీలో మచిలీపట్నం మంగళవారం జిల్లా ప్రథమస్థానంలో నిలవటంతో అసిస్టెంట్ కమిషనర్ కె. అనూష సిబ్బందిని అభినందించారు.

- పెదకళ్లేపల్లి(మోపిదేవి): మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంపీపీ దుర్గావాణి, సర్పంచ్ మేరీరాణి

మోపిదేవి: క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని ఎంపీపీ రావి దుర్గావాణి అన్నారు. మోపిదేవి మండల ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం మంగళవారం పాఠశాల హెచ్‌ఎం వై. స్వరూపరాణి అధ్యక్షతన జరిగింది.. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఉదయం సర్పంచ్ నందిగం మేరీరాణి జెండా ఆవిష్కరించారు. పాఠశాల ప్రగతి నివేదికను హెచ్‌ఎం చదివి వినిపించారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుకున్న విద్యార్థుల్లో ఉత్తమ ప్రగతి సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సాంస్కృతి కార్యక్రమాలలో ఉత్తమ ప్రతిభ కనపర్చిన విద్యార్థులకు బహుమతులు అందించారు. విశ్రాంత ప్రధానోపాధ్యాయిని జీహెచ్ విజయరమ, స్కూల్ అభివృద్ధి కమిటీ చైర్మన్ రావి నాగేశ్వరరావు, నందిగం అభిషేకరావు, ఆర్. మల్లేశ్వరి, మద్దాలి భవాని, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

సీనియర్ సివిల్ జడ్జి రామకృష్ణయ్య



చిలకలపూడి(మచిలీపట్నం): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ మంచి అలవాట్లను అలవరుచుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కేవీ రామకృష్ణయ్య అన్నారు. నగరంలోని సబ్‌జైల్‌లో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ చెడు వ్యసనాల వల్ల కలిగే నష్టాలను వివరించారు. గంజాయి అమ్మకాలు జరిపినా, కొనుగోలు చేసినా చట్టరీత్యా నేరమన్నారు. ఈ ఘటనలపై కేసులు నమోదైతే 15 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్ష విధిస్తారని చెప్పారు. యువత వారి తల్లిదండ్రుల మనోభావాలకు అనుగుణంగా చదువుకోవాలన్నారు. న్యాయ సహాయం అవసరమైనప్పుడు తమ సంస్థను ఆశ్రయిస్తే డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం ద్వారా న్యాయవాదిని ఏర్పాటు చేసి న్యాయ సహాయం అందజేస్తామని తెలిపారు. చీఫ్ డిఫెన్స్ లీగల్ ఎయిడ్ కౌన్సిల్ చీలి మురలయ్య, జైలు సూపరింటెండెంట్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లంకమ్మ అమ్మవారి జాతర



విద్యుత్ దీపకాంతులతో లంకమ్మ అమ్మవారి ప్రతిమ

అవనిగడ్డ: దివిసీమ ప్రజల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న లంకమ్మ అమ్మవారి జాతర మహోత్సవం బుధవారం జరుగనుంది. నియోజకవర్గంలోని పలు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు జాతరకు తరలివస్తారు. గత నెల 31వ తేదీన అమ్మవారిని బయటకు తీసి గ్రామోత్సవం నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు ఆలయ ప్రవేశం చేస్తారు. అదే రోజు ప్రధాన జాతర జరగడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో ఎలాంటి శుభకార్యం జరిగినా ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు ఆచరిస్తుంటారు. జాతర రోజున జిల్లా నలు మూలల నుంచి పెద్దఎత్తున భక్తులు తరలివచ్చి అమ్మవారికి ఘటం బిందెల సమర్పిస్తారు. రైతులు తమ పశువులను ఆలయం చుట్టూ తిప్పి అమ్మవారికి పసుపు, కుంకుమలు సమర్పిస్తారు. అమ్మవారి కోరిక మేరకు రజక సామాజిక వర్గానికి చెందిన వారు ఆలయ పూజారులుగా ఉంటున్నారు. జాతరను పురస్కరించుకుని ఆలయం, పరిసర ప్రాంతాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. డీఎస్పీ మహబూబ్‌బాషా ఆధ్వర్యంలో అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు శ్రీనివాస్, రవికుమార్ నేతృత్వంలో పలువురు ఎస్‌ఐలు పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. జాతర సందర్భంగా బుధవారం అన్నసమారాధన నిర్వహిస్తామని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అన్నపరెడ్డి రాందాస్, ఆలయ ఈఓ పి. సీతారామయ్య తెలిపారు.

మల్లవోలులో గంజాయి కలకలం

ముగ్గురి అరెస్ట్



తహసీల్దార్ బీవీ ప్రసాద్ సమక్షంలో పట్టుబడిన గంజాయిని తూకం వేస్తున్న పోలీసులు

గూడూరు: గూడూరు మండలం మల్లవోలు పంచాయతీలో గంజాయి కలకలం రేపింది. ఇప్పటి వరకు మల్లవోలు పరిసర ప్రాంతాల్లో గంజాయి ఆనవాలు లేవు. అలాంటిది ముగ్గురు వ్యక్తుల నుంచి మూడు కిలోల గంజాయి పట్టుబడటం చర్చనీయాంశంగా మారింది. బందరు రూరల్ సీఐ పి.వీరయ్య గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్లవోలుకు చెందిన బలుగూరి కిషోర్ (19) రేపల్లెలో ఐటీఐ చదివాడు. ఆ సమయంలో రేపల్లెకు చెందిన పీత రవితేజ, అమర్తమూరి దయాకరంలతో స్నేహం కుదిరింది. ఈ క్రమంలో చెడు వ్యసనాల బారినపడిన వీరికి గంజాయి అలవాటైంది. విద్యాభ్యాసం అయ్యాక మల్లవోలు వచ్చేసిన కిషోర్ గంజాయి కోసం ప్రయత్నించగా మల్లవోలు గరువుకు చెందిన రాంబాబు అనే వ్యక్తి సరఫరా చేస్తున్నాడని తెలుసుకుని అతని నుంచి గంజాయి తీసుకోవడం మొదలు పెట్టాడు. అతని వద్ద దొరకని సమయంలో బందరుకు చెందిన కత్తెర సాయి అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేయసాగాడు.

వీరికి విశాఖపట్నానికి చెందిన చంద్రశేఖరరెడ్డి సరఫరా చేస్తున్నాడన్న విషయం తెలుసుకున్న కిషోర్ తన స్నేహితులతో కలిసి చంద్రశేఖరరెడ్డిని సంప్రదించాడు.

దీంతో రెండు రోజుల కిందట చంద్రశేఖరరెడ్డి నుంచి మూడు కిలోల గంజాయి మల్లవోలుకు సరఫరా అయింది. పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి నిందితులను పట్టుకుని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గూడూరు తహసీల్దార్ బీవీ ప్రసాద్ సమక్షంలో గంజాయిని తూకం వేసి సీజ్ చేశారు. పట్టుబడిన ముగ్గురిపై కేసు నమోదు చేశారు. దాడుల్లో గూడూరు ఎస్‌ఐ వి.వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నాంచారమ్మ అమ్మవారి నెల సంబరం




కోడూరు: కృష్ణాతీరంలో భక్తుల ఇలవేల్పుగా పూజలందుకుంటున్న విశ్వనాథపల్లి అద్దంకి నాంచారమ్మ అమ్మవారి నెల సంబరాన్ని బుధవారం జరుగుతుందని ఆలయ ఈఓ పామర్తి సీతారామయ్య మంగళవారం తెలిపారు. అమ్మవారి ప్రధాన జాతర పూర్తయి నెల రోజులు కావడంతో మళ్లీ నెల సంబరాన్ని జరుపుతున్నామని చెప్పారు. ఉదయం కొండవీటి వంశీయుల ప్రత్యేక పూజల అనంతరం అమ్మవారికి మహిళలచే నైవేద్యాల సమర్పణ ఉంటుందని ఈఓ చెప్పారు. గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల భక్తులు అమ్మవారి దర్శనానికి అధిక సంఖ్యలో తరలివస్తారని, భక్తులకు ఏవిధమైన అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశామని తెలిపారు. నాంచారమ్మ అమ్మవారి మూలమూర్తికి ప్రత్యేక అలంకారం నిర్వహించి రాత్రి నెల సంబరాన్ని జరుపుతామని వివరించారు.

దివ్యాంగులను ఆదరించాలి

మచిలీపట్నంటౌన్: దివ్యాంగులను ప్రతి ఒక్కరు ఆదరించాలని కాశీనాథుని దుర్గాంబ బుచ్చయ్య (కేడీబీ) ట్రస్ట్ ప్రతినిధులు అన్నారు. మంగళవారం కేడీబీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలకు ఇంటలెక్చువల్ డెవలప్‌మెంటల్ డిజేబులిటీ కాలేజీ విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్లి అవగాహన కల్పించారు. దివ్యాంగులను గుర్తించడం, వారికి మనోస్థైర్యం కల్పించడం, వారు జనజీవన స్రవంతిలో మమేకమయ్యేలా తీర్చిదిద్దటం వంటి విషయాలను వివరించారు. కరపత్రాలు, వాల్‌పోస్టర్లను అందజేశారు. యలకుర్రు, మచిలీపట్నంలలో ట్రస్ట్ కేంద్రాల్లో దివ్యాంగులకు సంబంధించిన పలు సేవలను ఉచితంగా పొందవచ్చునని వారు తెలిపారు.

డ్రెయిన్లలో పూడికతీత



మచిలీపట్నంటౌన్: నగరంలోని పలు ప్రధాన డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాల తొలగింపు పనులు ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. మురుగునీరు సజావుగా పారేందుకు అనువుగా డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగిస్తున్నామని మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ యార్లగడ్డ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. నగరంలోని ఈడేపల్లి, సబ్‌జైలు, ఫతుల్లాబాద్ తదితర డ్రెయిన్లలో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుధ్య కార్మికులతో తొలగిస్తున్నామన్నారు.

విద్యతోనే సామాజిక ప్రగతి

నిమ్మగడ్డ (చల్లపల్లి): ప్రతి ఒక్కరూ విద్యావంతులైనప్పుడే సామాజిక ప్రగతి సాధ్యమని మాల మహానాడు జిల్లా నాయకులు దోవా గోవర్ధన్ అన్నారు. మంగళవారం రాత్రి పురిటిగడ్డ శివారు నిమ్మగడ్డలో అంబేడ్కర్ విగ్రహం వద్ద అంబేడ్కర్ దీక్షాధారుల సమావేశం నిర్వహించారు. అంబేడ్కర్ భావజాలాన్ని గోవర్ధన్ వివరించారు. అంబేడ్కర్ దీక్ష ఆద్యులు దాసి సీతారామరాజు, దోవా గోవర్ధన్ మాట్లాడారు. సర్పంచ్ మాతంగి రమ్య, గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.